సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం । 19 । మే । 2023



పల్లెలు 'స్వచ్ఛ'ం.. ప్రగతి మంత్రం

స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ఓడీఎఫ్ ప్లస్ కేటగిరీలో ఓరుగల్లు పల్లెలు మెరిశాయి. కాకతీయుల గడ్డ ఓడీఎఫ్ ప్లస్‌కు అడ్డాగా మారింది. - 8లో▸



సర్పంచ్‌లకు విలువ లేకుండా పోయింది

చేసిన పనులకు బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడడమే కాకుండా ఈ పాలనలో సర్పంచ్‌లకు విలువ పోయిందని నెల్లికుదురు మండల సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $41^0/26^0$

జిల్లాలో వాతావరణం ఉదయం నుంచి వేడిగా ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఎండతోపాటు వడగాలులు వీస్తాయి. రాత్రిళ్లు ఉక్కపోత ఉండనుంది.

న్యూస్‌రీల్

సైకాలజీ, బీటెక్ పరీక్షలు యథాతథం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఈ నెల 20నుంచి జరగాల్సిన ఎమ్మెస్సీ సైకాలజీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు, 22నుంచి జరగాల్సిన బీటెక్ చివరి సెమిస్టర్ పరీక్షలు యథావిధిగా జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకేంద్రాలు, టైంటేబుల్‌ను సంబంధిత వెబ్‌సైట్‌లో చూసుకోవాలని విద్యార్థులను కోరారు.

21న మెగా జాబ్‌మేళా

విద్యారణ్యపురి: హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వారు టెక్‌బీ ప్రోగ్రాం కోసం ఈనెల 21న ఉదయం 9గంటలకు హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డీఐఈఓ ఎ.గోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో 2022–2023లో ఎంపీసీ, ఎంఈసీలో 75శాతం మార్కులు, మ్యాథమెటిక్స్‌లో ఓవరాల్‌గా 60శాతం మార్కులు పొందిన అభ్యర్థులు హాజరుకావాలని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు జిరాక్స్, ఒక ఫొటో, ఆండ్రాయిడ్ మొబైల్‌తో జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు హెచ్‌సీఎల్ ప్రతినిధి 63032 07394, 75691 77071 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కాజీపేట జంక్షన్ మీదుగా భారత్ గౌరవ్ స్పెషల్ ట్రైన్



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా భారత్ గౌరవ్ ట్రైన్ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో జూన్ 10వ తేదీన నడిపించనున్నట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరే ఈ రైలు ప్రయాణికులకు నార్త్ ఇండియాలోని చారిత్రకమైన ప్రదేశాలు మాతా వైష్ణోవి దేవి దేవాలయం, హరిద్వార్, రిషికేష్ ప్రదేశాలలో 8 రాత్రులు, 9 పగలు దర్శనం ఉంటుందని చెప్పారు. రైలుకు సికింద్రాబాద్–వైష్ణోవి దేవి టెంపుల్ మధ్య కాజీపేట, రామగుండం, సిర్‌పూర్‌కాగజ్‌నగర్, బల్లార్షా, వార్ధా, నాగపూర్, మహారాష్ట్ర, కాట్రా, ఆగ్రా, మాతుర, విందావన్, కాట్రా, హరిద్వార్‌లలో బోర్డింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

20నుంచి తరగతులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఈ నెల 20నుంచి కొన్ని సెమిస్టర్ల విద్యార్థులకు ప్రత్యక్ష తరగతులు జరగనున్నాయి. ప్రస్తుతం వేసవి సెలవులు కొనసాగుతున్న నేపథ్యంలో పీజీ కోర్సుల నాల్గవ, బీఫార్మసీ, బీటెక్ చివరి సెమిస్టర్ల విద్యార్థులకు ఈనెల 20నుంచి తరగతులు నిర్వహించనున్నట్లు సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు గురువారం తెలిపారు. సెమిస్టర్ల విద్యార్థులకు మాత్రమే హాస్టల్ వసతితోపాటు మెస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు హాస్టళ్ల డైరెక్టర్ డాక్టర్ మంజుల తెలిపారు.

ప్రశాంతంగా ఎడ్‌సెట్

విద్యారణ్యపురి: బీఈడీ కోర్సులో ఈ విద్యాసంవత్సరం 2023–2023లో ప్రవేశాలకు గాను గురువారం నిర్వహించిన ఎడ్‌సెట్ ప్రశాంతంగా ముగిసింది. హనుమకొండలో నాలుగు కేంద్రాల్లో మూడు సెషన్‌లలో ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుంచి 11గంటల వరకు, మధ్యాహ్నం 12–30 నుంచి మధ్యాహ్నం 2–30గంటలవరకు, సాయంత్రం 4 నుంచి 6గంటలవరకు జరిగింది. మూడు సెషన్‌లలో కలిపి 3,011మందికిగాను 2,589 మంది (86శాతం) అభ్యర్థులు హాజరయ్యారని కేయూ విద్యాకళాశాల డీన్, ఎడ్‌సెట్ అబ్జర్వర్ రాంనాథ్‌కిషన్ తెలిపారు. వీసీ తాటికొండ రమేష్, అబ్జర్వర్ రాంనాథ్‌కిషన్ చైతన్య కళాశాల పరీక్షకేంద్రాన్ని తనిఖీ చేశారు.

ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ ఏవీ రంగనాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జి.సీతారెడ్డిని సీటీసీ నుంచి సీసీఆర్‌బీ, తౌటం గణేష్‌ను వీఆర్ నుంచి సీసీఆర్‌బీకి బదిలీ చేశారు.

'రావులపాటి'కి సహృదయ సాహిత్య పురస్కారం



హన్మకొండ కల్చరల్ : ప్రముఖ ద్విశతావధాని, డాక్టర్ రాళ్లబండి కవితాప్రసాద్ స్మృత్యకంగా సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ 2023 సంవత్సరానికిగాను ప్రముఖ రచయిత, రిటైర్డ్ ఐజీ రావులపాటి సీతారామారావును సహృదయ సాహిత్య పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ మేరకు ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గన్నమరాజు గిరిజామనోహరబాబు, డా.ఎన్వీఎన్ చారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రకృతి ప్రియులకు ఆహ్లాదం.. ఆనందం!

అందాల పొదరిల్లు.. వడ్డేపల్లి ట్యాంక్ బండ్

- రిజర్వాయర్ పొడవునా పచ్చదనమే
- పిల్లలను ఆకట్టుకుంటున్న నిర్మాణాలు
- వేసవిలో నగరవాసుల పిక్నిక్ స్పాట్

కాజీపేట: కనుచూపు మేరలో నీరు... మరోవైపు పరుచుకున్న పచ్చదనం.. అడుగడుగునా ఆకట్టుకునే నిర్మాణాలు.. కట్టిపడేసే ప్రకృతి సోయగాలతో పర్యావరణ ప్రేమికులకు ఆహ్లాదాన్ని పంచుతోంది వడ్డేపల్లి రిజర్వాయర్. సూర్యోదయం. సూర్యాస్తమాయ దృశ్యాలను రిజర్వాయర్ నీటిలో చూస్తూ ప్రకృతి ప్రేమికులు తన్మయత్వం చెందుతున్నారు. రిజర్వాయర్ పక్క నుంచి నిత్యం రాకపోకలు సాగించే రైలుబండ్లు పిల్లలతోపాటు పెద్దలను ఆకర్షిస్తున్నాయి.

నిర్మాణాలు ఇలా..

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ, నగర పాలక సంస్థలు సంయుక్తంగా వడ్డెపల్లి చెరువు కట్టపై చేపట్టిన గార్డెన్ అందరినీ ఆకట్టుకుంటోంది. సిద్ధార్థనగర్‌–కేయూ 100 ఫీట్‌రోడ్డుకు పక్కనే ఈ సుందర ప్రదేశం ఉంది. ఆధ్యాత్మికత, ప్రశాంతత ఈ పార్కు ప్రత్యేకత. కట్టపై అడుగిడిన వెంటనే ఆహ్వానం పలికేది శ్రీవల్లీదేవ సమేతుడైన సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం. ఇక్కడ నిత్య పూజలు, అభిషేకాలు కొనసాగుతాయి. పక్కకు చూస్తే కాకతీయ పైథాన్, బతుకమ్మ విగ్రహాలు కనువిందు చేస్తాయి. పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ చొరవతో దాదాపు రూ.2 కోట్లకుపైగా ప్రభుత్వ నిధులను వ్యయం చేసి వాస్తవికత ఉట్టిపడేలా చేపట్టిన పలు అభివృద్ధి పనులు అబ్బురపరుస్తున్నాయి. ఇటీవలి కాలంలో సందర్శకుల తాకిడి బాగా పెరిగింది. సహజ అందాలను తలపించేలా ఆర్కిటెక్చర్లు ఇక్కడ నిర్మాణాలను కళాత్మకంగా తీర్చిదిద్దారు. రెండు దశాబ్దాలుగా నగర ప్రజల దాహార్తిని తీరుస్తున్న వడ్డెపల్లి రిజర్వాయర్ కట్టపై పర్యాటకులను ఆకర్షించేలా ఆహ్లాదంగా ఉండేలా నిర్మాణాలు చేపట్టారు. వాకర్స్ కోసం ప్రత్యేక ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు.

చిన్నారుల్లో హుషార్...

పార్కులో పిల్లలను కట్టిపడేసే దృశ్యాలు కనువిందు చేస్తుండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో తల్లిదండ్రులు పిల్లలతో అధిక సంఖ్యలో రావడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. పిల్లలు, పెద్దలు కూర్చొని ముచ్చట్లు పెట్టుకోవడానికి రాతి బల్లలు, సహజత్వం ఉట్టిపడేలా కర్రలతో చేసినట్లుగా భ్రమకలిగించే స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. రెండు వైపులా ఎటుచూసిన సింహం నోరు తెరుచుకుని లోపలికి రమ్మని పిలుస్తున్నట్లుగా కనిపించే గుహలో ఆడుకోవడానికి పిల్లలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. మరిన్ని నిధులు మంజూరు చేయించి రిజర్వాయర్ కట్ట పొడవునా పనులు చేపట్టాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.



వెదురు కర్రతో చేసినట్లుగా అబ్బురపరిచే స్వాగత తోరణాలు




పార్కులో కూర్చునే బల్లలు, గ్రీనరీ



రిజర్వాయర్‌లో అస్తమిస్తున్న సూర్యుడి అందాలు

సందర్శన వేళలు
ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు
టికెట్ ధరలు
• పెద్దలకు రూ.10 • చిన్నారులు రూ.5 • కెమెరాకు రూ.20



సింహం గుహలో ఆడుకుంటున్న పిల్లలు, పెద్దలు

ట్యాంక్ బండ్‌కు పెరుగుతున్న ఆదరణ



ట్యాంక్‌బండ్‌పై ఆహ్లాదకర వాతావరణం ఉండడంతో పర్యాటకుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. చిన్నాపెద్ద తేడా లేకుండా రిజర్వాయర్ అందాలు తిలకించడానికి వస్తున్నారు. చెరువుతోపాటు సూర్యాస్తమయం, రైళ్ల రాకపోకలను చూడాల్సిందే.

\- పాము రాజేష్, కాజీపేట

రిజర్వాయర్‌లో బోటును ప్రవేశపెట్టాలి



పర్యాటక ప్రాంతంగా ఎదుగుతున్న రిజర్వాయర్ చూసేందుకు కుటుంబంతో సహా వచ్చాం. ఇంకా అభివృద్ధి చేయాల్సిన పనులు ఉన్నాయి. పిల్లలు ఆడుకునే వస్తువులున్నాయి. రిజర్వాయర్‌లో బోటును ప్రవేశపెట్టి పూర్తిస్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి.

\- బొల్లం రవీందర్, ధర్మసాగర్

ఊరికెళ్తున్నారా.. జాగ్రత్త

- సీపీ రంగనాథ్
- తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రం ఆవిష్కరణ

వరంగల్ క్రైం: వేసవి సెలవుల్లో ఊరికెళ్లేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ హెచ్చరించారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ.. వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం విభాగం రూపొందించిన కరపత్రాన్ని సీపీ రంగనాథ్ గురువారం గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్రైం డీసీపీ మురళీధర్, ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్, క్రైం ఏసీపీ డేవిడ్‌రాజ్, కాజీపేట ఏసీపీ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ తిరుమల్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

సీపీ అందించిన సూచనలివే..

- ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదును భద్రపర్చుకోవాలి.
- బీరువా తాళాలు ఇంట్లోనే ఉంచకుండా తమ వెంట తీసుకెళ్లాలి.
- ఎక్కువరోజులు విహార యాత్రకు వెళ్లేముందు పేపర్, పాల వారికి రావొద్దని సూచించాలి.
- పని మనిషి ఉంటే రోజూ ఇంటి ఎదుట శుభ్రం చేయమనాలి.
- విలువైన వస్తువులు, వ్యక్తిగత విషయాల్ని ఇతరులకు చెప్పొద్దు.
- ఇంటి ప్రధాన ద్వారానికి సెంట్రల్ లాకింగ్ సిస్టమ్, సీసీ కెమెరాల్ని ఏర్పాటు చేసుకోవాలి.



కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీ రంగనాథ్

- ఐపీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా మీ ఇంటి స్థితిగతులను మొబైల్‌లో ఎప్పటికప్పుడు వీక్షించవచ్చు.
- ఎట్టి పరిస్థితుల్లో బయట గేటుకు తాళం వేయొద్దు. లోపలి నుంచి బెడెం పెట్టాలి.
- ఇంటి లోపల, బయట లైట్ వేసి ఉంచాలి.
- అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలు, వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- సంబంధింత పోలీస్ స్టేషన్, ఏరియా కానిస్టేబుల్ సెల్‌నంబర్లు దగ్గర ఉంచుకోవాలి.
- ఇళ్లకు తాళం వేసి ఊరికి వెళ్లేటప్పుడు చుట్టు పక్కల వారికి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలి.
- ప్రజలు, పోలీసులు సమన్వయంతో కలిసి పని చేస్తే చోరీలను నియంత్రించవచ్చు.
- కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే తక్షణమే పోలీసులకు లేదా డయల్ 100, వరంగల్ పోలీస్ కమిషనరేట్ వాట్సాప్ 87126 85294, క్రైం డీసీపీ 8712685103, క్రైం ఏసీపీ 8712685135, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ 8712685 136 నంబర్లకు సమాచారం అందించాలి.

సీఎం కప్ క్రీడలకు ఏర్పాట్లు చేయండి

వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: జిల్లా స్థాయిలో నిర్వహించే సీఎం కప్–23 క్రీడలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ఈనెల 22 నుంచి 24 వరకు నిర్వహించనున్న జిల్లాస్థాయి క్రీడా ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్షించి బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఈనెల 22న ఓ సిటీ స్టేడియంలో క్రీడలు ప్రారంభమవుతాయని, క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. క్రీడలు జరిగే రెండు చోట్ల ప్రథమ చికిత్స కిట్లు, ట్యాబ్లెట్లు తదితర మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. మొదటి రోజు 22న సాయత్రం మార్చ్‌ఫాస్ట్, బెలూన్స్ వదలడం వంటి కార్యక్రమాల కోసం ఓ సిటీలో టెంట్, లైటింగ్ తదితర ఏర్పాట్లు చేయాలని జీడబ్ల్యూఎంసీ అధికారులకు సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడె, డీపీఓ, డీవైఎస్‌ఓ, డీఈఓ తదితరులు పాల్గొన్నారు.

కోత పేరుతో దోపిడీ

- సేకరణ కేంద్రాల్లో బస్తాకు మూడు కిలోలు, రైస్‌మిల్లుల్లో మరో రెండు కిలోలు
- తాలు, తరుగు పేరున తిరకాసు
- అధికారులు పర్యవేక్షించి హెచ్చరిస్తున్నా ఆగని దోపిడీ
- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో రైతుల ఆక్రందన

సాక్షి, వరంగల్/హన్మకొండ: ఓ వైపు ప్రకృతి ప్రకోపం చూపిస్తూ చేతికొచ్చిన పంటను నేలపాలు చేస్తే, ఉన్న పంటను అమ్ముకుందామని వెళ్తే రైస్‌మిల్లర్లు దోపిడీకి పాల్పడుతున్నారు. అధికారులకు చెప్పుకుంటే బాధలు తీరుతాయని ఆశిస్తే...భంగపాటు తప్పడం లేదని రైతులు మండిపడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకోలేని దుస్థితిలో రైతన్నలు కొట్టుమిట్టాడుతున్నారు. హనుమకొండ జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలుకు అధికార యంత్రాంగం 163 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఐకేపీ ద్వారా 54, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 109 ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఇప్పటివరకు 150 కేంద్రాలు తెరిచారు. తెరిచిన చోట్ల కూడా తూకం వేయకుండా ఇబ్బంది పెడుతున్నారు. వరంగల్ జిల్లాలో ప్రారంభించిన 196 కొనుగోలు కేంద్రాల నుంచి 52 మిల్లులకు ఇప్పటి వరకు 32,200 టన్నులు (3,22,000 క్వింటాళ్లు) కొనుగోలు జరిగిందని పౌర సరఫరా విభాగాధికారులు చెబుతున్నారు. జిల్లాలో 2,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించారు. ఇక్కడ బస్తాకు 2 నుంచి 3 కిలోలు అదనంగా తూస్తున్నారని రైతులు చెబుతున్నారు.

మద్దతు ధర మాటెలా ఉన్నా..

మద్దతు ధర మాటేమో కానీ, రైస్‌మిల్లర్లు చేస్తున్న దోపిడీ అంతా ఇంతా కాదు. క్వింటాల్‌కు 12 నుంచి 13 కిలోల వరకు కోత విధిస్తున్నారని రైతులు మొత్తుకుంటున్నారు. కొనగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు బస్తాకు 41.700 కిలోలు తూకం వేయాల్సి ఉండగా, నాణ్యత పేరుతో 44కిలోల నుంచి 45 కిలోల వరకు వేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇక్కడ బస్తాకు మూడు నుంచి నాలుగు కిలోల తరుగు తీస్తున్నారని రైతులు చెప్పారు. రైస్‌మిల్లుకు చేరుకున్నా తర్వాత అక్కడ మరో రెండు కిలోలు తరుగు పేరుతో కోతలు విధిస్తున్నారని రైతులు వాపోయారు. మొత్తంగా క్వింటాల్‌కు 12 నుంచి 13 కిలోల వరకు కోతలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సాక్షి పరిశీలన

హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ శివారులోని గోదావరి రైస్‌మిల్లు యజమాని తాలు, తరుగు పేరున బస్తాకు నాలుగు కిలోలు కోత విధిస్తున్నాడని వచ్చిన ఆరోపణల మేరకు భయపడి గురువారం యజమాని రైస్‌మిల్లు గేట్ మూసి వేశాడు. ధాన్యం దించేందుకు కమలాపూర్ మండలంలోని వివిధ గ్రామాలనుంచి వచ్చిన ట్రాక్టర్లు మిల్లువద్ద సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. డ్రైవర్లు కనీసం అందుబాటులో తాగడానికి మంచినీళ్లు లేక అనేక ఇబ్బందులకు గురయ్యారు.

అధికారులు హెచ్చరించినా ఫలితం లేదు..

కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, సీపీ రంగనాథ్, సివిల్ సప్లయిస్ అధికారులు కొనుగోలు కేంద్రాలు సందర్శిస్తూ తరుగు పేరుతో అధిక తూకం వేయొద్దని, రైస్‌మిల్లుల్లో కోతలు విధించొద్దని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా ఫలితం లేదు. అధికారుల హెచ్చరికలను ఖాతరు చేయడం లేదు. పైగా కొందరు రైస్‌మిల్లర్లు తమను బద్‌నాం చేస్తున్నారంటూ ధాన్యం వాహనాలు మిల్లులోకి రాకుండా గేట్‌కు తాళం వేస్తున్నారు.

ఫిట్‌నెస్ పరీక్షలు షురూ..



ఫిట్‌నెస్ పరీక్ష వచ్చిన విద్యాసంస్థల బస్సులు

ఖిలా వరంగల్: జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభ కానున్న నేపథ్యంలో వరంగల్ జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో గురువారం ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సుమారు 6 స్కూల్ బస్సులకు ఆన్‌లైన్‌లో వివరాల్ని నమోదు చేశారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా 451 బస్సులున్నాయి. ఇందులో 15 ఏళ్లు పూర్తి చేసుకున్న బస్సులు 48 ఉండగా.. ప్రస్తుతం ఫిట్‌నెస్ చేయాల్సిన బస్సులు మొత్తం 443 ఉన్నాయి. ఈనెల 15తో కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులకు ఫిట్‌నెస్ కాల పరిమితి ముగిసింది. ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో డ్రైవర్, అటెండెంట్, విద్యాసంస్థల వివరాలు, విద్యార్థుల వివరాలు రూట్‌మ్యాప్‌తో కూడిన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం ఆర్టీఏ కార్యాలయానికి చేరుకున్న బస్సులకు ఎంవీఐలు, ఏఎంవీఐలు సామర్థ్యాన్ని పరీక్షిస్తారు.

ఫిట్‌నెస్ లేకపోతే సీజ్..

వరంగల్ ఆర్టీఏ కార్యాలయానికి గురువారం 6 స్కూల్ బస్సులు రాగా.. కార్యాలయ ఆవరణ సందడిగా కనిపించింది. దీనిపై ఆర్టీఓ ఆఫ్రీన్ సిద్ధిఖీని వివరణ కోరగా.. ఆన్‌లైన్‌లో వివరాల నమోదు అనంతరం బస్సు కండీషన్ బట్టి ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు త్వరగా బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. జూన్ 12 తర్వాత ఫిట్‌నెస్‌లేని బస్సు రోడ్డు ఎక్కితే సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తామని ఆర్టీఓ ఆఫ్రీన్ సిద్ధిఖీ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంవీఐలు రవీందర్, వెంకన్న, ఏఎంవీఐలు శాలిని, ఏఓ నరేందర్, బస్సుల యాజమాన్యాలు, ఆర్టీఏ సిబ్బంది పాల్గొన్నారు..

సప్తగిరి మిల్లుకు ధాన్యం కేటాయింపు నిలిపివేత

- అదనపు కలెక్టర్ ఉత్తర్వులు జారీ
- రైస్‌మిల్లర్‌తోపాటు మరో ఇద్దరి అరెస్ట్

హసన్‌పర్తి: నిబంధనలకు విరుద్ధంగా తరుగు పేరిట రైతులను మోసం చేస్తున్న నాగారం శివారులోని సప్తగిరి రైస్ నిర్వాహకులపై జిల్లా ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఈ మిల్లుకు కస్టమ్ మిల్లింగ్ కోసం ఇస్తున్న ధాన్యాన్ని నిలిపివేయాలని నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం రాత్రి జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఉత్తర్వులు జారీ చేశారు. సీపీ రంగనాథ్ తనిఖీలో తరుగు పేరిట బస్తాకు నాలుగు కిలోల నుంచి ఐదు కిలోల మేరకు కోత విధిస్తున్నట్లు తేలడంతో ఈ చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా రైస్‌మిల్లుపై నివేదిక అందించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సివిల్‌సప్లయ్ మండల డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ నివేదికను అందించారు. దీని ఆధారంగా మిల్లుకు ధాన్యం కేటాయింపులు రద్దు చేశారు.

పోలీసుల అదుపులో రైస్‌మిల్లర్

సప్తగిరి రైస్‌మిల్లు నిర్వాహకుడు ఎర్రబెల్లి రాంగోపాల్‌రావును పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనతోపాటు మిల్లులో పనిచేస్తున్న రవి, అనిల్ అనే గుమస్తాలపై కేసు నమోదు చేశారు. ముగ్గుర్ని గురువారం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ధాన్యాన్ని మిల్లుకు తీసుకొస్తే తరుగు పేరిట బస్తాకు ఐదు కిలోలు కోత విధిస్తున్నాడని కమలాపూర్ మండలం నేరేళ్లకు చెందిన గోల్కొండ శ్రీనివాస్ అనే రైతు బుధవారం రాత్రి హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు మిల్లు నిర్వాహకుడితో పాటు ఇద్దరు గుమస్తాలపై కేసు నమోదు చేశారు.

నిర్ణీత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: జిల్లాలోని అన్ని మండలాల్లో జరుగుతున్న ఉపాధి హామీ, నర్సరీ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాల లక్ష్యాలను వర్షాకాలం రాకముందే పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలాల్లో క్రీడా ప్రాంగణాల కోసం స్థలాలు గుర్తించాలని, స్థలాలు ఉన్న చోట జూన్ 2 నాటికి పనులు పూర్తి చేయాలని అదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలోని వైకుంఠధామాల్లో కరెంట్, నీటి సౌకర్యం తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఓ జగదీశ్వర్, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఎస్‌బీఎం బృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి

జూన్ 5 వరకు జరిగే పరిశుభ్రత వారోత్సవాల కార్యక్రమాల నిర్వహణపై ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకొని గ్రామాల్లో సభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత వారోత్సవాల్లో భాగంగా మండలస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలను గురువారం కలెక్టరేట్‌లో అధికారులకు వివరించారు.

మడికొండ టెక్స్‌టైల్ పార్క్‌కు పూర్తిస్థాయి రక్షణ



అధికారులతో సమావేశమైన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- మరో చోటుకు డంపింగ్ యార్డు
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమీక్ష

సాక్షి ప్రతినిధి, వరంగల్: మడికొండ టెక్స్‌టైల్ పార్క్‌కు పూర్తిస్థాయి రక్షణ కల్పించేందుకు పక్కనే ఉన్న డంపింగ్ యార్డును మరో చోటుకు తరలించేందుకు యత్నాలు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని తన పేషీలో సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ గతంలో ముంబయి, భీమండి, సూరత్ వంటి సుదూర ప్రాంతాలకు చేనేత కార్మికులు వలస వెళ్లేవారని, ఆ వలసల్ని ఆపేందుకు ఆయా ప్రాంతాలకు అప్పటి మన మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లి వారిని ఒప్పించి, మడికొండలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుచేసి ఉపాధి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇంత చేసి కార్మికులకు ఇబ్బందులు కలిగే విధంగా మడికొండ పార్కును వదిలివేయడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. వెంటనే మడికొండ పార్క్ సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆ పక్కనే ఉన్న డంపు యార్డును మరోచోటికి తరలించేందుకు ప్రయత్నాలు చేయాలని, వెంటనే వరంగల్ మహానగర కార్పొరేషన్ అధికారులతో మాట్లాడాలని మంత్రి సూచించారు. తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు చేనేత కార్మికులకు అండగా ఉన్నారని తెలిపారు. టీఎస్ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, టెక్స్ టైల్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ మిహిద్, అడిషనల్ డైరెక్టర్ వెంకటేశం పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రేడ్‌-2 కార్యదర్శిగా విధుల్లో చేరిన రాము



వరంగల్‌: ఏనుమాములలోని వరంగల్‌ వ్యవసాయ మార్కెట్‌ గ్రేడ్‌-2 కార్యదర్శిగా నియమితులైన శ్రీరామోజు రాము గురువారం జాయిన్‌ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న గ్రేడ్‌-2 కార్యదర్శి తోట చందర్‌రావు పదోన్నతిపై నల్గొండ జిల్లా నిడమనూరు మార్కెట్‌ కమిటీ గ్రేడ్‌-1 కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో ఆదిలాబాద్‌ బోథ్‌ మార్కెట్‌ కమిటీలో గ్రేడ్‌-3 కార్యదర్శిగా పనిచేస్తున్న రాము గ్రేడ్‌-2 కార్యదర్శిగా పదోన్నతి పొందడంతో వరంగల్‌ మార్కెట్‌లో గ్రేడ్‌-2 బదిలీపై వచ్చారు. ఆయన మార్కెట్‌ ఎస్‌జీఎస్‌ బీవీ.రాహుల్‌ను కలసి జాయినింగ్‌ రిపోర్టు అందించారు. నూతనంగా వచ్చిన గ్రేడ్‌-2 రామును మార్కెట్‌ ఉద్యోగులు, సిబ్బంది కలసి శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వే ట్రాఫిక్‌ బ్లాక్‌తో పలు రైళ్ల రద్దు

కాజీపేట రూరల్‌/కాశిబుగ్గ: సికింద్రాబాద్‌ రైల్వే డివిజన్‌ పరిధిలోని ఘట్‌కేసర్‌- చర్లపల్లి రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే నిర్మాణ పనుల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈనెల 21వ తేదీన ట్రాఫిక్‌ బ్లాక్‌ చేపట్టినట్లు గురువారం రాత్రి తెలిపారు. ట్రాఫిక్‌ బ్లాక్‌తో కాజీపేట, వరంగల్‌ మీదుగా నడిచే పలు రైళ్ల రద్దుతోపాటు రీషెడ్యూల్‌ చేసినట్లు వెల్లడించారు.

రద్దయ్యే రైళ్లు..

కాజీపేట- సికింద్రాబాద్‌, సికింద్రాబాద్‌ - వరంగల్‌, వరంగల్‌- హైదరాబాద్‌ వెళ్లే పుష్‌పుల్‌, హైదరాబాద్‌- సిర్పూర్‌ కాగజ్‌నగర్‌, సిర్పూర్‌ కాగజ్‌నగర్‌- హైదరాబాద్‌, సిర్పూర్‌ కాగజ్‌నగర్‌- సికింద్రాబాద్‌, సికింద్రాబాద్‌- గుంటూరు(గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌), గుంటూరు- సికింద్రాబాద్‌, సికింద్రాబాద్‌- సిర్పూర్‌ కాగజ్‌నగర్‌ వెళ్లే రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.



చాలెంజింగ్‌ చౌళ్లపెల్లి: హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం చౌళ్లపెల్లి గ్రామం ఇది. ఈ గ్రామంలో 600 కుటుంబాలు, మూడు వేల మంది వరకు జనాభా ఉంటుంది. ఈ గ్రామాన్ని బహిరంగ మల విసర్జన లేని గ్రామంగా తీర్చిదిద్దేందుకు ఊరి ప్రజలు 2018లో కంకణం కట్టుకున్నారు. ప్రతి కుటుంబం మరుగుదొడ్డిని నిర్మించుకోవడమే కాకుండా 100శాతం వాడుతున్న ఈ గ్రామం మండలంలో ఆదర్శంగా నిలిచింది.



ఓడీఎఫ్‌ ఆరాటం.. మూడేళ్ల పోరాటం : జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గుంటూరుపల్లి గ్రామం ఇది. బహిరంగ మల విసర్జన లేని గ్రామం (ఓడీఎఫ్‌) కోసం ఆ ఊరి ప్రజలు ప్రతినబూనారు. ఈసారి ప్రకటించిన జాబితాలో గుంటూరుపల్లి ఉంది. 201 ఇళ్లు 727 మంది ఉన్న ఈ గ్రామంలో పురుషులు 354, మహిళలు 373 మంది కాగా సర్పంచ్‌ కూడా మహిళనే.



స్టేషన్‌ఘన్‌పూర్‌ ది గ్రేట్‌: స్టేషన్‌ఘన్‌పూర్‌ గ్రామంలో 12,721 జనాభా, 3,862 కుటుంబాలు ఉన్నాయి. ఓడీఎఫ్‌ కోసం బహిరంగ మల విసర్జన చేస్తే రూ.500 రూపాయలు జరిమానా విధించారు. ప్రభుత్వం నుంచి మరుగుదొడ్ల నిర్మాణానికి అందించిన ఆర్థిక ప్రోత్సాహాలను ప్రజలకు అందించి వారిని చైతన్యం చేయడం ద్వారా సుమారు ఐదేళ్ల పాటు సాగిన ఉద్యమంలో సర్పంచ్‌, వార్డు సభ్యుల పట్టుదల, ప్రజల భాగస్వామ్యంతో ఓడీఎఫ్‌గా ఘనత సాధించింది.

పల్లెలు ‘స్వచ్ఛ’ం.. ప్రగతి మంత్రం

- ఓడీఎఫ్‌ ప్లస్‌లో మెరిసిన ఓరుగల్లు పల్లెలు
- నూరుశాతం ఓడీఎఫ్‌ గ్రామాలు..

సాక్షిప్రతినిధి, వరంగల్‌: స్వచ్ఛభారత్‌ మిషన్‌లో భాగంగా ఓడీఎఫ్‌ ప్లస్‌ కేటగిరీలో ఓరుగల్లు పల్లెలు మెరిశాయి. కాకతీయుల గడ్డ ఓడీఎఫ్‌ ప్లస్‌కు (బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలు) అడ్డాగా మారింది. 2018 నుంచి కంకణబద్ధులై చేస్తున్న ఉద్యమం ఫలించింది. ఉమ్మడి వరంగల్‌లో 1,688 (నూరుశాతం) గ్రామాలు ఓడీఎఫ్‌ ప్లస్‌ సాధించి రికార్డుకెక్కాయి. బహిరంగ మల విసర్జన నుంచి విముక్తి పొందిన ఈ గ్రామాల్లో ఘన లేదా ద్రవ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థ అమల్లో ఉంటే వాటిని ఓడీఎఫ్‌ ప్లస్‌ గ్రామాలుగా పిలుస్తారు. ఈమేరకు గ్రామీణ స్వచ్ఛభారత్‌ మిషన్‌ రెండో దశ ఫలితాలను కేంద్ర జల్‌శక్తి శాఖ ఇటీవల వెల్లడించింది. స్వచ్ఛభారత్‌ మిషన్‌లో భారత్‌ మరో మైలురాయిని దాటినట్లు పేర్కొంది. మిషన్‌ రెండో దశలో దేశవ్యాప్తంగా 51.91శాతం గ్రామాలు ఓడీఎఫ్‌ ప్లస్‌ స్థాయికి చేరాయని.. ఇందులో 100% ఫలితాలు సాధించి తెలంగాణ టాప్‌లో నిలిచినట్లు వెల్లడించగా, ఉమ్మడి వరంగల్‌ గ్రామాలు మొదటి వరుసలో నిలిచాయి.

తెలంగాణ ప్రజలకు అభినందనలు



ఓడీఎఫ్‌ ప్లస్‌లో తెలంగాణ మొదటి స్థానంలో నిలవడం తెలంగాణ ప్రజల సమష్టి విజయం. అందరికీ అభినందనలు. బహిరంగ మల విసర్జన రహిత స్థితిని కొనసాగించడం, బయో-డిగ్రేడబుల్‌, పీవీఎం, ఎల్‌వీఎం తదితర చర్యలను తెలంగాణ సమర్థంగా కొనసాగిస్తోంది. ఈ కారణంగానే ఓడీఎఫ్‌ ప్లస్‌ అమలులో తెలంగాణకు 100 శాతం వచ్చింది. ఇందులో సీఎం కేసీఆర్‌, మంత్రి కేటీఆర్‌ల ప్రోత్సాహం ఉంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులకు అభినందనలు.

- ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి

అందరి సహకారంతో 100 శాతం ఓడీఎఫ్‌



మా గ్రామంలో అందరి సహకారంతో 100శాతం ఓడీఎఫ్‌ సాధించాం. మహిళా సంఘాలతో అవగాహన కల్పించాం. గ్రామంలో దండోరా వేయించి వాల్‌ రైటింగ్‌ రాయించాం. ఉపసర్పంచ్‌, వార్డు సభ్యులు, పంచాయతీ సెక్రెటరీ, జీపీ సిబ్బంది అందరు రాజకీయాలకు అతీతంగా శ్రమించారు.

- కంచ రవికుమార్‌, సర్పంచ్‌, చౌళ్లపెల్లి

మూడేళ్ల ఆరాటం... ప్రజల సహకారం



మా గ్రామంలో మరుగుదొడ్లు 100 శాతం ప్రజల సహకారంతో పూర్తి చేశాం. ప్రభుత్వం చేపట్టిన పథకంలో భాగంగా గ్రామంలో ప్రతి ఇంటింటికి తిరిగి ఒక మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాం. దీంతో పరిసరాల పరిశుభ్రత, సమాజంలో ఇబ్బంది పడే అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లాం. గ్రామంలోని కొంతమందికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో వాటి నిర్మించుకోవడానికి మూడేళ్లు పట్టింది.

- పువ్వాటి రాణి, సర్పంచ్‌, గుంటూరుపల్లి

నూరుశాతం ఓడీఎఫ్‌... చాలా సంతోషంగా ఉంది



అందరి కృషితోనే జనగామ జిల్లా (281 గ్రామాలు) వందశాతం ఓడీఎఫ్‌గా సాధించింది. కలెక్టర్‌ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో సదస్సులు ఏర్పాటు చేసినం. అన్ని శాఖలను సమన్వయం చేస్తూ... వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రతి వ్యక్తికి అవగాహన కల్పించాం. తగిన ఫలితం వచ్చినందుకు సంతోషంగా ఉంది.

- గూడూరు రాంరెడ్డి, ఆర్డీఓ, జనగామ

వడదెబ్బతో కూలీ మృతి



లక్ష్మి(ఫైల్‌)

కేసముద్రం: వడదెబ్బకు గురైన ఓ మహిళా కూలీ గురువారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానుకోట జిల్లా కేసముద్రం మండల కేంద్రానికి చెందిన బొంపెల్లి లక్ష్మి(45) కేసముద్రం మార్కెట్‌ పరిధిలోని ఓ ట్రేడింగ్‌ కంపెనీలో కూలీగా పనిచేస్తుంది. ఈ క్రమంలో బుధవారం కూలీ పనికి వెళ్లిన ఆమె ఎండదెబ్బతో అస్వస్థతకు గురైంది. ఉదయం తీవ్ర అస్వస్థతకు గురైన ఆమె ఇంట్లోనే మృతి చెందింది.

గట్టికల్‌లో బాలుడు..



మణికంఠ మృతదేహం

రాయపర్తి: వరంగల్‌ జిల్లా రాయపర్తి మండలంలోని గట్టికల్‌ గ్రామానికి చెందిన కాంబోతు ప్రభాకర్‌ కుమారుడు మణికంఠ (12) వడదెబ్బతో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మణికంఠ కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు బతుకుదెరువుకోసం వెళ్లారు. ఈక్రమంలో మణికంఠ వడదెబ్బకు గురై అస్వస్థకు గురికావడంతో గమనించిన తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించగా గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు తెలిపారు. దీంతో మృతదేహాన్ని స్వగ్రామం గట్టికల్‌ తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

వడదెబ్బతో వృద్ధురాలు..



మాలి (ఫైల్‌)

గార్ల: ఎండ తీవ్రత, వడగాడ్పులకు తట్టుకోలేక ఓ వృద్ధురాలు వడదెబ్బకు గురై మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానుకోట జిల్లా గార్ల మండలం మద్దివంచ పంచాయతీ కొత్తతండాకు చెందిన సపావట్‌ మాలి(70) ఎండలు, వడగాడ్పులకు తట్టుకోలేక వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థకు గురై గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. మాలి మృతదేహాన్ని వైస్‌ ఎంపీపీ కట్టెబోయిన శ్రీనివాసరావు సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కాంట్రాక్టు లెక్చరర్ల బైక్‌ ర్యాలీ

కేయూ క్యాంపస్‌: యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్‌ చేయాలని కుక్టా నాయకులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు కేయూ మొదటి గేట్‌ నుంచి రెండో గేట్‌వరకు గురువారం బైక్‌ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుక్టా అధ్యక్షుడు డాక్టర్‌ శ్రీధర్‌కుమార్‌ లోథ్‌ మాట్లాడుతూ రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. రవీందర్‌, మధుకర్‌రావు, చంద్రశేఖర్‌, గడ్డం కృష్ణ, ప్రసన్నరాణి, లక్ష్మి, కల్పన, సంగీతకుమార్‌, విజయ్‌కుమార్‌, రాకేష్‌రెడ్డి, సురేందర్‌, కుమార్‌, రవీందర్‌, మల్లేష్‌, బ్రహ్మయ్య తదితరులున్నారు.

అన్నపుట్టిన రోజునే తమ్ముడి మృతి

- ఆర్టీసీ బస్సు-ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఘటన
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అన్న



వినయ్‌ మృతదేహం

హసన్‌పర్తి: అన్నదమ్ములిద్దరూ కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. స్వగ్రామాన్ని విడిచి బతుకుదెరువు కోసం వేరే ఊరికి వెళ్లారు. ఈక్రమంలో అన్న పుట్టినరోజు వేడుకలు కుటుంబ సభ్యులతో నిర్వహించుకునేందుకు గురువారం తెల్లవారుజామున స్వగ్రామానికి పయనమైన వారిని బస్సు రూపంలో ప్రమాదం వెంటాడింది. దీంతో తమ్ముడు మృతి చెందగా.. అన్న ఆస్పత్రి పాలయ్యాడు. ఈఘటనకు సంబంధించి పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం రాంపూర్‌కు చెందిన మునిగాల సుధాకర్‌కు ఇద్దరు కుమారులు విజయ్‌, వినయ్‌(25). నెలరోజులుగా వీరిద్దరూ హుజూరాబాద్‌లో ఉంటూ కూలీ పనిచేసుకుంటున్నారు. ఈక్రమంలో బుధవారం తెల్లవారుజామున అన్నదమ్ములిద్దరూ హుజూరాబాద్‌ నుంచి స్వగ్రామానికి ద్విచకవాహనంపై బయల్దేరారు. విజయ్‌ వాహనం నడుపుతుండగా, వినయ్‌ వెనుక కూర్చున్నాడు. బాహుపేట క్రాస్‌వద్దకు చేరుకోగానే, హనుమకొండ నుంచి నిజామాబాద్‌ వెళ్తున్న బాన్సువాడ డిపోకు చెందిన ఆర్టీసి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో వినయ్‌ అక్కడిక్కడే మృతి చెందగా.. విజయ్‌కు బలమైన గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌ నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఆర్టీసీ బస్సు అజాగ్రత్తగా నడిపి తన కుమారుడు వినయ్‌ మృతికి కారకుడైన డ్రైవర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి సుధాకర్‌ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ప్రాణం తీసిన ఈత సరదా



సమ్మయ్య మృతదేహం

టేకుమట్ల(రేగొండ): సరదా కోసం ఈతకు వెళ్లి ప్రాణాలను కోల్పోయిన సంఘటన జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని దమ్మన్నపేట శివారులో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రేగొండ మండలంలోని చెన్నాపూర్‌కు చెందిన సూరం సమ్మయ్య(32), హమాలీగా కూలీ పని చేస్తుంటాడు. రోజువారీలాగే పని ముగిశాక తోటి కూలీలతో కలిసి సరదాగా దమ్మన్నపేట శివారులోని వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లారు. వ్యవసాయ బావి మోటార్‌కు ఉన్న తాడు తొలగించి కాసేపు ఈత సరదా తీర్చుకున్నారు. మోటార్‌ తాడు నీటి అడుగుకు చేరుకోగా తాడును తీసుకొచ్చేందుకు సమ్మయ్య నీటి అడుగు భాగానికి వెళ్లి ఊపిరాడక మృతి చెందాడు. దీంతో తోటి కార్మికులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరక్కపోవడంతో పరకాల ఫైర్‌ సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని సమ్మయ్య మృతదేహాన్ని వెలికితీశారు. కాగా, మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

భార్యను కత్తెరతో పొడిచిన భర్త

- జనగామ ఆస్పత్రికి తరలింపు



గాయపడిన భాగ్యలక్ష్మి

నర్మెట: భార్య తల వెంట్రుకలు కత్తిరించి అదే కత్తెరతో తలపై భర్త తీవ్రంగా గాయపరచిన ఘటన మండలంలోని అమ్మాపురంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా నర్మెట మండలంలోని అమ్మాపురానికి చెందిన బైరగోని భాస్కర్‌కు జనగామ గిర్నిగడ్డకు చెందిన భాగ్యలక్ష్మితో పదమూడేండ్ల క్రితం వివాహం జరగగా ఇద్దరు సంతానం అక్షర, సాయి. ఈక్రమంలో హైదరాబాద్‌లో నివాసముంటున్న భార్యభర్తల మధ్య కలహాలు చోటు చేసుకోవడంతో పలు మార్లు పెద్దలు సర్దిచెప్పినా ఫలితం లేకపోయింది. ఈనేపథ్యంలో భాస్కర్‌ హైదరాబాద్‌లో భార్య నాగలక్ష్మి అమ్మాపురంలోనే అద్దె ఇంట్లో పిల్లలతో కలసి నివాసముంటున్నది. ఈక్రమంలో గురువారం రాత్రి అకస్మాత్తుగా వచ్చిన భాస్కర్‌ ఇంట్లో చొరబడి భార్యపై దాడి చేశాడు. అడ్డుగా వచ్చిన పొరుగింటి రేఖ, కూతురు అక్షరపై దాడిచేయడంతో పాటు వెంట తెచ్చుకున్న పెట్రోలును తన ద్విచక్ర వాహనంపై పోసి నిప్పటించి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ప్రైవేటు వాహనంలో భాగ్యలక్ష్మిని జనగామ ఆస్పత్రికి తరలించారు.

లారీ ఢీ కొని వ్యక్తి మృతి

దంతాలపల్లి: మానుకోట జిల్లా దంతాపల్లి మండలకేంద్రంలో లారీ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కూచిపూడి జగదీష్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలప్రకారం మండల కేంద్రానికి చెందిన తూర్పాటి శివరాం(51) గురువారం ఉదయం తన ఇంటి దగ్గరనుంచి చాయ్‌ తాగేందుకు సెంటరుకు వస్తున్నాడు. ఈ క్రమంలో సూర్యపేట వైపు నుంచి కర్రలోడుతో వరంగల్‌ వైపు వెళ్తున్న లారీ డ్రైవర్‌ అతివేగంగా అజాగ్రత్తతో నడుపుతూ శివరామ్‌ను ఢీ కొనడంతో ఆయన రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. చికిత్సనిమిత్తం 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు ఆసిఫాబాద్‌ జిల్లాకు చెందిన లారీ డ్రైవర్‌ పిప్రే ప్రకాష్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భూమి మాది.. కాదు మాది



కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న కడిపికొండ దళితులు

కాజీపేట అర్బన్‌ : కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని సర్వే నంబర్‌ 366లోని పంచారాయి భూమి మాదంటే మాది అంటు కడిపికొండకు చెందిన దళితులు, టీఎన్జీవోస్‌ ఉద్యోగులు గురువారం పరస్పరం వాగ్వాదానికి దిగారు. టీఎన్జీవోస్‌ ఉద్యోగులు పంచరాయి భూమిని ప్రభుత్వం తమకు కేటాయించిందంటూ గురువారం సర్వేయర్‌ సారంగపాణితో భూసర్వే నిర్వహించేందుకు యత్నించగా భూమి విషయం హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా కోర్టు ఆర్డర్‌ను దిక్కరించి సర్వే ఎలా నిర్వహిస్తారని అడ్డుకున్నామని కడిపికొండ దళితులు తెలిపారు. పదేండ్లుగా పంచరాయి భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్న టీఎన్జీవోస్‌ ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, భూ హక్కుదారులమైన మాకు అప్పగించాలని కలెక్టరేట్‌ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొండూరి రవి, బస్కే దశరథం, నాగేందర్‌రావు, అనిత, బస్కే రాజేందర్‌, ప్రదీప్‌, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఓ వైపు టీఎన్జీవోస్‌ అధికారులు, కడిపికొండ దళితుల నడుమ వాగ్వాదం జరుగుతుండగానే ఓ పార్టీకి చెందిన నాయకులు గుడిసెలు వేయించడం చర్చనీయాంశంగా మారింది.

సర్పంచ్‌లకు విలువ లేకుండా పోయింది



సమావేశంలో పాల్గొన్న వివిధ గ్రామాల సర్పంచ్‌లు

- ఈ - పాలనలో సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా కార్యదర్శులు బిల్లులు డ్రా చేయడాన్ని నిలువరించాలి
- 36 గ్రామాల సర్పంచ్‌ల ఆవేదన

నెల్లికుదురు: చేసిన పనులకు బిల్లులురాక తీవ్ర ఇబ్బందులు పడడమే కాకుండా ఈ పాలనలో సర్పంచ్‌లకు విలువలు లేకుండా పోయాయని మహబూబాబాద్‌ జిల్లా నెల్లికుదురు మండల పరిధిలోని 36 గ్రామాల సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు నెల్లికుదురులో గురువారం ప్రత్యేకంగా సమావేశమై తమ సమస్యలపై చర్చించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాలని ఆదేశాలు ఇవ్వడమే తప్ప చేసిన పనులకు బిల్లులు ఇవ్వడం లేదని, కాని పనులు చేయకుంటే నోటీసులు పంపి సర్పంచ్‌లకు విలువ లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా పంచాయతీ కార్యదర్శులు బిల్లులు విడుదల చేయడాన్ని నిలిపివేయాలని డిమాండ్‌ చేశారు. శానిటేషన్‌ పెండింగ్‌ బిల్లులు విడుదల చేసిన తర్వాతనే శానిటేషన్‌ పనులు నిర్వహిస్తామని, అప్పటివరకు వాయిదా వేయాలని కోరుతూ ఎంపీడీఓకు వినతి పత్రం అందించారు. సమావేశంలో సర్పంచ్‌లు బీరవెల్లి యాదగిరిరెడ్డి, భీముడు, జయపాల్‌రెడ్డి, అశోక్‌, అనిల్‌, నారాయణరెడ్డి, బిక్కునాయక్‌ పాల్గొన్నారు.

దేవుడి సొమ్ముకు శఠగోపం

- తొమ్మిది వెండి చెంబులు మాయం
- విచారణ చేస్తున్న మట్టెవాడ పోలీసులు

వరంగల్‌ చౌరస్తా: వరంగల్‌ బట్టలబజారు వేంకటేశ్వర స్వామి దేవాలయం అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారిందనడంలో సందేహం లేదు. సగటు భక్తుడు కనీస సౌకర్యాల్లేక అల్లాడుతున్న పట్టించుకునే వారు లేరు. కానీ స్వామి వారి ఆలయం ఆదాయాన్ని అందిన కాడికి వాటాలుగా నైవేద్యంగా పంపకాలు చేసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలయంలో అపహరణకు గురైన వెండి చెంబులపై గురువారం సాయంత్రం మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. ఆలయంలో స్వామి వారికి అభిషేకాలకు ఉపయోగించే 9 వెండి చెంబులు ఈనెల 11న రాత్రి అపహరణకు గురయ్యాయి. బీరువాను కట్‌ చేసి ఎత్తుకెళ్లారు. ఈ విషయం ఆలయ ఈఓ, అర్చకులు, కింది స్థాయి సిబ్బంది వరకు అందరికి తెలుసు. వీటి విలువ రూ.1.50లక్షలు ఉంటుందని అంచనా. కానీ, అపహరణ విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. ఈ నోట ఆ నోట చెంబులు మాయమైన విషయం తెలియడంతో దేవాదాయ శాఖ ఉన్నతధికారులు ఆలయానికి వచ్చి విచారణ చేపట్టగా నీళ్ల నమలడం ఈఓ, సిబ్బంది వంతైంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎట్టకేలకు గురువారం సాయంత్రం వేంకటేశ్వర ఆలయ ఈఓ రత్నాకర్‌ రెడ్డి మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై మట్టెవాడ ఎస్సై ప్రసన్న కుమార్‌ విచారణ చేపట్టారు.

పనిచేయని సీసీ కెమెరాలు..

దేవాలయంలోని సీసీ కెమెరాలను పోలీసులను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇందులో కొన్ని కెమెరాలు కొద్ది నెలలుగా పనిచేయడం లేదని సమాచారం. ఈ విషయంపై ఆలయ సిబ్బందిని ప్రశ్నిస్తే పనిచేస్తలేవని, వాస్తవమేనని పేర్కొనడం గమనార్హం. ఇంటి దొంగలు ఈ వెండి చెంబులను మాయం చేసి ఉంటారని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. కానీ, ఇన్ని రోజులు ఫిర్యాదు చేయకపోవడంతో పోలీసులు మరో కోణంలో విచారణ చేస్తున్నారు. దాతలు, భక్తులు భక్తి భావంతో అందచేస్తున్న వస్తువులు అపహరణకు గురికావడంపై పెద్ద చర్చ జరుగుతోంది. గతంలో అనేక మార్లు ఇలాంటి దొంగతనాలు జరిగినా ఆలయ నిర్వాహకులు మౌనం వహించడం వెనక ఆంతర్యమేంటని భక్తుల సందేహం.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

- 8 మందిపై కేసు నమోదు



గుప్తనిధుల కోసం తవ్విన గుంత

చిట్యాల: జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని బావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన అజ్మీరా సమ్మయ్య ఇంట్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టగా పోలీసులు గుట్టురట్టు చేసి 8 మందిని అరెస్ట్‌ చేశారు. ఎస్సై ఎండీ.షాఖాన్‌ తెలిపిన వివరాల ప్రకారం.. బావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన అజ్మీరా సమ్మయ్య ఇంట్లో గుప్తనిధులు ఉన్నట్లు అదే గ్రామానికి చెందిన మరో అజ్మీరా సమ్మయ్య భార్య అజ్మీరా విజయ కలలో (నిద్రలో) వచ్చిందని తెలిపారు. దీంతో భార్య భర్తలు ఇద్దరు కలిసి ములుగు జిల్లా జీవంతరావుపల్లికి చెందిన ఆలోతు రతన్‌సింగ్‌, ఓర్సుల రమేష్‌, పాలీయా రాజ్‌కుమార్‌, జంగాలపల్లికి చెందిన భీమగాని అశోక్‌, మంచిర్యాల జిల్లాకు చెందిన గొస్కుల ఓదేలు, ఈదులకంటి రాజుల సహకారంతో తవ్వకాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. సమాచారం మేరకు దాడులు జరిపి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై పేర్కొన్నారు. ఈ దాడుల్లో పోలీస్‌ సిబ్బంది ఎండీ గౌస్‌, లాల్‌సింగ్‌, అస్లాంజాని, తదితరులు పాల్గొన్నారు.